క్లుప్తంగా

రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంయుక్త కార్యదర్శిగా షేక్షావలి



షేక్షావలిని సత్కరిస్తున్న సీఈఓ రమణ, అసోసియేషన్ నాయకులు

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా షేక్షావలి ఎన్నికయ్యారు. ఈ నెల 2వ తేదీ ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో ఎన్నికైన షేక్షావలిని మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వెయిట్‌లిఫ్టింగ్ హాలులో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ, అసోసియేషన్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా ఉన్న తనకు రాష్ట్ర స్థాయి పదవి రావడం సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పర్వేజ్, వీరేష్, నరసింహ నాయక్ పాల్గొన్నారు.

పారదర్శకంగా విద్యుత్ బిల్లులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు జారీ చేసే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న సూచించారు. మంగళవారం ఆయన కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారీ విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా చూడాలని చెప్పారు. బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా చెల్లించడం సులభమని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌లో కేఎంసీ విద్యార్థికి ప్రథమ బహుమతి



డాక్టర్ మహమ్మద్ అబుజాహిద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థి ప్రథమ బహుమతి సాధించాడు. వైజాగ్‌లోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఇటీవల నిర్వహించిన సీఎంఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 18 మెడికల్ కాలేజీల నుంచి వైద్య విద్యార్థులు పాల్గొని పోటీపడ్డారు. క్విజ్ పోటీలో కర్నూలు మెడికల్‌కాలేజీ అనెస్తీషియా విభాగం ఫైనలియర్ విద్యార్థి డాక్టర్ మహమ్మద్ అబుజాహిద్ ప్రథమ బహుమతి సాధించాడు. మంగళవారం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ అభినందించారు.

రాయలసీమ సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్, సుంకన్న మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కురువ మద్దిలేటి, ఎర్రకోట మల్లప్ప, వెల్దుర్తి ఎల్ల రాముడు, జయరాముడు, గణేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఉత్సవాలను ఈ నెల 5వ తేదీన (నేడు) ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక ఐదు రోడ్ల కూడలిలో ఉదయం 9 గంటలకు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం అక్కడే బహిరంగసభ ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన అధికారులు ప్రముఖులు,దళితసంఘాలనాయకులు, ప్రజలుపెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'ఉద్యోగ' కాంతులు

- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉస్మానియా డిగ్రీ కళాశాల విద్యార్థుల జయకేతనం
- వివిధ కంపెనీల్లో 75 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన డిగ్రీ విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్

కర్నూలు కల్చరల్: సాధారణ డిగ్రీ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరుస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారు. కళాశాల అధ్యాపకుల మార్గదర్శనం.. ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ విద్యార్థుల్లో నవ్యకాంతులను నింపుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌తో పాటు ప్లేస్‌మెంట్స్‌లో స్కిల్స్‌ను ప్రదర్శించి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. ఉస్మానియా డిగ్రీ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థులు 75 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్లేస్‌మెంట్స్ ఇలా..

- ఐసీఐసీ బ్యాంక్‌లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ హోదాలో పనిచేసేందుకు 22 మంది ఎంపికయ్యారు. వీరికి తెలంగాణ రాష్ట్రంలో రూ.25,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.23,000 ప్రారంభ జీతం లభిస్తుంది.
- ఆల్‌సెక్ టాక్నాలజీస్ సంస్థలో బెంగళూరు, చెన్నైలో ఉద్యోగాలకు 15 మంది ఎంపికయ్యారు. వీరికి బెంగళూరులో రూ.16,000, చెన్నైలో రూ.15,000 ప్రారంభ వేతనంతో పాటు ఇతర అలవెన్సెస్ ఇవ్వనున్నారు.
- జియో డిజిటల్ సంస్థలో కస్టమర్ అసోసియేట్ ట్రైనీగా విధులు నిర్వహించేందుకు 38 మంది ఎంపికయ్యారు. వీరికి నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో స్కిల్‌ను బట్టి వేతనం, ఉద్యోగ హోదా, సదుపాయాలు ఇవ్వనున్నారు.

ఇంటర్న్‌షిప్ ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నాం:

కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివిధ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నాం .దాంతో పాటు వివిధ ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నాం.విద్యార్థుల్లోని స్కిల్స్, సామర్థ్యం, కమ్యూనికేషన్‌స్కిల్స్ ను బట్టి ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఈ ఏడాది 75 మంది విద్యార్థులు డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలు సాధించారు.

– డాక్టర్ మండి అన్వర్ హుసేన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఉస్మానియా కళాశాల

చాలా సంతోషంగా ఉంది

ఆల్‌సెక్ టాక్నాలజీస్ సంస్థ చెన్నై కంపెనీకి ఎంపికయ్యాను. నేను సివిల్ సర్వీ సెస్ ఐఏఎస్, ఐపీఎస్ సా ధించిన వారి ఇంటర్వ్యూ లు ఫాలో కావడం నా ఇంటర్వ్యూకు సహకరించాయి. మంచి సంస్థలో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– నాయకంటి అమూల్య, బీఎస్సీ (ఎంపీసీఎస్), మూడో సంవత్సరం

వర్కింగ్ స్కిల్‌ను గుర్తించి

ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. సొంతంగా వ్యాసాన్ని రాయడం, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. ముఖ్యంగా వర్కింగ్ స్కిల్, వర్కింగ్ స్టైల్, స్టామినా ఉందా లేదా అనేది వారు గమనించారు. హైదరాబాద్‌లో ప్లేస్‌మెంట్ ఇచ్చే అవకాశం ఉంది.

– రేణుక, బీకాం కంప్యూటర్స్, తృతీయ సంవత్సరం

ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం

ఉద్యోగానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న చిన్న వ్యాపారి. ఆయన కు తోడుగా నిలవాలనుకున్నారు. కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం లభించింది. కళాశాలలో ఇచ్చిన శిక్షణ బాగా తోడ్పడింది. డిగ్రీ పూర్తి కాక ముందే ఉద్యోగానికి ఎంపిక కావడం గర్వంగా ఉంది. – షేక్ షాఫిర్, బీకామ్, తృతీయ సంవత్సరం

డిగ్రీ పూర్తికాకుండానే ఉద్యోగం

మాది మధ్య తరగతి కుటుంబం.డిగ్రీ పూర్తికాకుండానే ఐసీఐసీఐ బ్యాంక్‌లోఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. కళాశాల ఇంటర్న్‌షిప్ ఉద్యోగ సాధనకు ఉపయోగ పడింది. ఈ ఏ డాది నుంచే ఇది పూర్తి స్థాయిలో అమలు చేయడంతో మాలాంటి యువతకు మంచిఉద్యోగాలు లభిస్తాయి.

–షేక్ షేక్షావలి,బీఎస్సీ డిగ్రీ, తృతీయ సంవత్సరం

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ పేట శ్రీరామాలయం 98వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఏడు రోజులు ప్రతి రోజూ ఏకాంత సీతారాముల వారికి సుప్రభాత సేవ, పంచామృతము, దివ్యాలంకారాలతో పంచరాత్రాగమంతో హోమాలు, రోజుకొక వాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఉదయం పండిత శ్రీ విద్యానిధి ఆచార్యులచే మహాభారత తాత్పర్య నిర్ణయం, సాయంకాలం పండిత శ్రీ గోవర్ధనాచార్యులచే శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 9వ తేదీ కర్ణాటక ప్రముఖ కళాకారులచే భక్తి సంగీత విభావరి, 10వ తేదీ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంకాలం గడియారం ఆసుపత్రి దగ్గర గల నూతన స్వర్ణాలంకార రథంలో రథోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

నేడు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మదినం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం సప్తగిరి మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5.30 నుంచి గణపతి హోమం, అష్ట కళశాభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు పడి పూజ, పుష్పాభిషేకం, నృత్య శిక్షకులు డాక్టర్ భార్గవకుమార్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు, శేషయాదవ్, హరినారాయణ, జయశేఖర్ బృందంచే భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులు అందరూ పూజల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రక్తహీనత లేకుండా చూడాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భవతులకు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతిగా గుర్తించిన వెంటనే గర్భిణీ వివరాలు నమోదు చేయాలన్నారు. వారికి ఎప్పుడెప్పుడు ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లీ బిడ్డ క్యాలెండర్ ద్వారా ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులను తేదీల వారీగా పర్యవేక్షించాలని సూచించారు. హైరిస్క్ కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీ పీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత, ఎంపీహెచ్ఈవో రమణ, పీహెచ్ఎన్ వీరకుమారి, హెచ్ఎస్ సంపత్ కుమార్, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నిర్మల్ నగర్‌లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ నిర్మల్‌నగర్ పార్కులో ఆసరా సంబరాలలో భాగంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 32,33,34,35వ వార్డులలోని మొత్తం 517 పొదుపు సంఘాల మహిళలకు రూ. 3.27కోట్ల చెక్కును అందించారు. మహిళలతో కలసి సీఎం చిత్రటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు పొందిన రుణాలతో మెరుగైన జీవనోపాధులను కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, ఆయా వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టీఎమ్‌సీ సుధాకర్, సీఎమ్ఎమ్‌లు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మానవ మార్గదర్శకుడు మహవీర్



కర్నూలు పట్టణంలో భగవాన్ మహవీర్ జయంతి ర్యాలీని నిర్వహిస్తున్న జైనులు

కర్నూలు కల్చరల్: జైన 24వ తీర్థంకరుడు భగవాన్ మహవీర్ 2622వ జయంతి వేడుకలు మంగళవారం కర్నూలు నగరంలో ఘనంగా జరిగాయి. శ్రీ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఓల్డ్ సిటీలోని జైన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తాంబర్ నిర్వహించారు. జైన్ ఆలయం నుంచి మహవీర్ చౌక్ వరకు మహవీరుని చిత్రపటంతో జైనులు భారీ ఊరేగింపు నిర్వహించారు. జైన్ మహిళలు మహవీర్‌ను ధ్యానిస్తూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నగర శివారులోని గోశాలలో గోపూజ, గోవులకు గ్రాసం పంపిణీ చేశారు. ఇళ్లలో తయారు చేసిన రొట్టెలను ఆహారంగా గోవులకు తినిపించారు. పుల్లూరులోని మహవీర్ ధామ్‌లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిగాయి. భక్తి సంధ్యా కార్యక్రమాలు నిర్వహించారు. జైన్ సంఘం ప్రతినిధులు జయంతి లాల్, దినేష్, రంజిత్ జైన్, భరత్ జైన్, రమేష్, చందు, విజయ్, తమన్‌లాల్, హస్తిమల్, సురేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

7న సీపీఐ జిల్లా సమితి సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని ఈ నెల 7వ తేదీన సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లుచెప్పారు. ఈ సమావేశంలో వేసవిలో తాగునీటి ఎద్దడి, 14 నుంచి ప్రారంభమయ్యే వామపక్ష పార్టీల పాదయాత్రలపై విస్తృత చర్చ జరుపుతున్నట్లు చెప్పారు.

కురుబ, కురుమ యువత అభివృద్ధికి కృషి

- కురుబ, కురుమ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ



రామకృష్ణకు నియామకపత్రం అందిస్తున్న ఆర్ క్రిష్ణయ్య

కర్నూలు(అర్బన్): కురుబ, కురుమ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన కే రామకృష్ణ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో జరిగిన తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంఘం ప్రతినిధుల సమావేశంలో తన పేరును సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ప్రకటించినట్లు రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తనకు రాజ్యసభ సభ్యులు ఆర్ క్రిష్ణయ్య, అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు నియామక పత్రాన్ని అందించారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురుబ, కురుమ సామాజిక వర్గానికి చెందిన వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా కురుబ, కురుమ యువతను విద్యా, రాజకీయ రంగాల వైపు మళ్లించి వారి అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువజన విభాగం కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ భాస్కరరెడ్డి, షేక్ నజీర్‌హుసేన్

కర్నూలు(హాస్పిటల్): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ధర్మపేటలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మంగళవారం స్థానికుడు షేక్ నజీర్‌హుసేన్ దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన హోమియో వైద్యులు డాక్టర్ కె. భాస్కరరెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు వారి పరిధిలో పేదలకు సాయం చేయాలని సూచించారు.

ప్రశాంతంగా టెంకాయల వేలం

గూడూరు: ఈ నెల 14 నుంచి జరగనున్న తిమ్మగురుడు స్వామి బ్రహోత్సవాలను పురస్కరించి మంగళవారం నిర్వహించిన టెంకాయల వేలంపాట ప్రశాంతంగా జరిగింది. ఆలయ ఈఓ గురు రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో నిర్వహించిన వేలంలో ఉత్తకాల్వ రామాంజనేయులు అనే వ్యక్తి రూ.91 వేలకు వేలం పాట దక్కించుకున్నాడు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కో ఆప్షన్‌మెంబర్ పి.రామాంజనేయులు, కౌన్సిలర్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు టౌన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి రోడ్డు సెక్షన్ పరిధిలో చేపడుతున్న నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా రేడియో స్టేషన్ ఏరియా, మల్లారెడ్డి వెంచర్–1, 2, ప్రియా హోమ్స్–1, 2, హ్యాపీ హోమ్స్, విష్ణు టౌన్‌షిప్, ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆచార్య రంగారెడ్డి సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రంగారెడ్డి సంస్మరణ సభను బుధవారం సాయంత్రం 6 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, రాయలసీమ ఎకనామిక్స్ అసోసియేషన్ ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్ తెలిపారు. ఆచార్య రంగారెడ్డి శిష్యులు, రాయలసీమ వాదులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కార్యాలయాల్లో పూలే, అంబేడ్కర్ చిత్రపటాలు ఉంచాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్ర పటాలను ఉంచేలా చర్యలు తీసుకో వాలని బహుజన విద్యావంతుల వేదిక నాయకులు జేవీ కృష్ణయ్య, రామశేషయ్య, జయన్న, రంగస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. వారి సేవలను స్ఫూరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో చిత్ర పటాలు శాశ్వతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరపాలకలో తాత్కాలిక టాయిలెట్లు

కర్నూలు (టౌన్): నగరపాలకలో టాయిలెట్ల సమస్యకు చెక్ పెట్టారు. నగరపాలక ప్రాంగణంలో నూతన నగరపాలక సంస్థ కార్యాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అందులో భాగంగా ప్రాంగణంలో ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ టౌన్ ప్రాజెక్టు కార్యాలయంతో పాటు సమీపంలోనే ఉన్న మహిళల, పురుషుల టాయిలెట్లను తొలగించారు. టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో నగరపాలక ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో నగరపాలక కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలకలోనే రూ.5 లక్షలు వెచ్చించి తాత్కాలికంగా టాయిలెట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం వాటిని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పరిశీలించారు.

సేవా కార్యక్రమాలతో భక్తిని చాటుకోవాలి




మాట్లాడుతున్న జర్మనీ సంస్థ ప్రతినిధి బార్బరా అస్వాల్డ్

కర్నూలు(హాస్పిటల్): మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించి భక్తిని చాటుకోవాలని బాలసాయిబాబా ఈ.వి మ్యూనిక్ జర్మని సంస్థ ప్రతినిధి బార్బరా ఆస్వాల్డ్ చెప్పారు. మంగళవారం బాలసాయి ఆశ్రమంలో బాలసాయి పాఠశాల విద్యార్థులకు కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్ ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బార్బరా ఆస్వాల్డ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. బాలసాయి ట్రస్ట్ మెంబర్ టి.రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు తొలిదశలోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కర్నూలు మెల్విన్ జోన్స్ కార్యదర్శి సీడీజీ. గిరి, శ్రీధర్, జర్మనీ సంస్థ సభ్యులు ఇంగ్రిడ్ హుబెస్ట్, బియాంకా జియంట్ బావార్, జూలియాసేవాట్, పెట్రాషాపర్, సామ్యూల్ షాపర్, జియాంట్ బావర్, గ్వింటర్, రూబీష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుడి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్న చెంచయ్య (45) సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిన్నర క్రితం తల్లి లక్ష్మీదేవి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ కూడా భారమయ్యింది. ఈయనకు భార్య నాగమణితో పాటు నలుగురు సంతానం. ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి కిందికి దించి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ ఏఎస్ఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు.



- బొప్పాయి..బడాయి

కర్నూలు పట్టణంలోని దేవనగర్‌లోని ఒక పండ్ల షాపులో బాకు ఆకారం ఉన్న బొప్పాయి పండు పలువురు దృష్టిని ఆకర్షించి ఆశ్చర్యపరిచింది. ఈ పండు దాదాపు 2 కేజీలు బరువు ఉన్నట్లు వ్యాపారి తెలిపాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐనాయకులపై విధించి న సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..వర్సి టీ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేశారన్నా రు. ఈ మధ్య ఫైనల్ ఇయర్ పరీక్షల్లో జరిగిన అవకతవకాలపై డీన్ చేసిన పొరపాట్లను ఎత్తిచూపిన ఐదుగురు ఎస్ఎఫ్ఐ నాయకులపై అధికారులు సస్పెన్షన్ వేటు వేసి.. హాస్టల్ నుంచి బహిష్కరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అమర్, నరసింహ, మధు పాల్గొన్నారు.

ఉలిందకొండలో బండలాగుడు పోటీలు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో ఈ నెల 6న శ్రీశ్రీ ఘనమద్దిలేటి స్వామి తిరునాల సందర్భంగా బండలాగు పోటీలు(న్యూ క్యాటగిరి), భజన పోటీలు, గుండు ఎత్తు పోటీలు నిర్వహిస్తున్నట్లు మద్దిలేటిస్వామి ఆలయ క్యార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం శ్రీ ఘన మద్దిలేటి వారికి, శ్రీ లక్ష్మిదేవి వారికి కల్యాణ మహోత్సవం, సాయంత్రం ప్రభ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయపడిన గిరి, నాగరాజు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలి మెట్ట గ్రామం వద్ద జాతీ య రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కొంతవరం గ్రామానికి చెందిన గిరి, నాగరాజులు పాణ్యం గ్రామంలో శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయం వద్ద మద్యం మానుకునేందుకు పూజ చేసి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో గాయపడిన ఇద్దరిని స్థానికులు నంద్యాల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.